మిలాఖత్ అవుదామా...వెనక్కు తగ్గుదామా..!

◆ మద్యం షాపులపై మంతనాలు ◆ మరో మూడు రోజులు పొడిగించే అవకాశం ?

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

మద్యం దుకాణాల టెండర్ల దాఖలుకు సమయం బుధవారంతో ముగియనుంది. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ రెండు పద్ధతుల్లోనూ టెండర్ల స్వీకరణ జరుగుతోంది. రెండేళ్ల కాల వ్యవధితో ఇస్తున్న ఈ టెండర్లు దక్కించుకునేందుకు అనేక మంది వ్యాపారులు, రాజకీయ నాయకులు దృష్టి సారించారు. రాబోయే రెండేళ్ల కాలంలో జరగబోయే మద్యం వ్యాపారాన్ని చేజిక్కించుకునేందుకు నేతలు కూడా సిద్ధమయ్యారు. 2019 ముందు వరకు ఇదే విధానం ఉండేది. 2019 అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం ఈ విధానాన్ని రద్దు చేసి ప్రభుత్వ మద్యం పాలసీని తీసుకొచ్చింది. దీనిపై అనేక ఆరోపణలు, విమర్శలు వెల్లువెత్తాయి. ఈ క్రమంలో మద్యం విధానం మార్పు చేస్తామని ప్రకటించిన తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తూనే దీనిపై దృష్టి సారించింది. కొత్త విధానాన్ని ప్రకటించడమే కాకుండా టెండర్లు ఆహ్వానించింది. గడిచిన ఐదేళ్లుగా మద్యం వ్యాపారం లేకపోవడంతో వ్యాపారులతోపాటు, రాజకీయ నాయకులకు ఆదాయం వనరు లేకుండా పోయింది. ఇప్పుడు ఆ ఆదాయం మార్గం రావడంతో మద్యం టెండరును దక్కించుకునేందుకు ఉత్సాహం చూపారు. ప్రభుత్వం పెట్టిన రెండు లక్షల రుసుం భారంగానే ఉన్నప్పటికీ అదృష్టం పరీక్షించుకుందామని కొంత మంది ఆలోచిస్తున్నారు. అయితే ఈ నేపథ్యంలో అధికార పార్టీ ప్రజాప్రతినిధులు మాత్రం ఇంత ఆదాయ వనరును వదులుకునేందుకు సిద్ధపడటం లేదు. ఎలాగైనా తాము దక్కించుకోవాలని నేరుగానే రంగంలోకి దిగుతున్నారు. తమ అనుయాయుల ద్వారా దరఖాస్తులు చేసుకోవాలనుకున్న వారికి హెచ్చరికలు జారీ చేస్తున్నారు. తమ పరిధిలో తమ అనుమతి లేకుండా ఎవరూ వేయడానికి వీల్లేదని చెబుతుండటంతో టెండర్లపై ఆశలు పెట్టుకున్న వారిలో నిరాశే ఎదురవుతోంది. రెండు లక్షలు ముందుగా చెల్లించి తరువాత రాకపోయినా... ఒకవేళ వచ్చినా ప్రజాప్రతినిధులను ఎదురించి మద్యం దుకాణం నడపడం సాధ్యమవుతుందా అన్న సందేహాలతో చాలా మంది వెనక్కు తగ్గుతున్నారు.

అనంతపురం జిల్లాలో 136 మద్యం దుకాణాలకు టెండరు పిలిస్తే 1272 మాత్రమే దాఖలయ్యాయి, సత్యసాయి జిల్లాలో 87కుగానూ 617 దాఖలయ్యాయి. బుధవారంతో టెండరు దాఖలు గడువు ముగియనుంది. సమయం తక్కువగా ఉండటంతో ఉన్న వారు నేతలను ప్రసన్నం చేసుకుని పనిలో ఉండగా, మరికొంత మంది గ్రూపులుగా అయ్యి టెండరు వేయడానికి సిద్ధపడుతున్నారు. చివరి రోజు ఏ రకంగా దరఖాస్తులు రానున్నాయన్నది చూడాల్సి ఉంది. జిల్లాలో ఆయా నియోజకవర్గాల్లో ముఖ్య నేతలు మాత్రం టెండరు దాఖలుపైగా నిశితంగా దృష్టి సారించారు. తమకు తెలియకుండా ఎవరు వేస్తున్నారన్న దానిపై ఎప్పటికప్పుడు వివరాలు సేకరిస్తున్నారు. ఒకటి,రెండు నియోజకవర్గాల్లో ముఖ్య నేతలే తమ సమీప బంధువులు, అనుయాయుల ద్వారా దరఖాస్తులు చేయించారు.

మరో మూడు రోజులు పొడిగించే అవకాశం..?

మద్యం దుకాణాల టెండర్లకు స్పందన తక్కువగా ఉండటంతో ప్రభుత్వం మరో మూడు రోజులు పొడిగించే అవకాశాలున్నట్టు తెలుస్తోంది. ఈ మేరకు ప్రభుత్వం నిర్ణయం తీసుకునే అకవాశాలున్నట్టు ప్రచారాలు సాగుతున్నాయి. ఇంకోవైపు నేతలు మాత్రం కట్టడి చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారు.

నేడు ఏఎఫ్ ఎకాలజీలో అవగాహన సదస్సు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం నగరంలోని ఎఎఫ్ ఎకాలజీ కేంద్రంలో వాతావరణ అనుకూల సుస్థిర గ్రామాభివృద్ధి అవగాహన సదస్సులు బుధవారం నాడు ప్రారంభం కానున్నాయి. రెండు రోజుల పాటు జరుగనున్న ఈ సదస్సులకు పలువురు శాస్త్రవేత్తలు రానున్నారు. బుధవారం ఉదయం 10 గంటలకు సదస్సు ప్రారంభమవనన్నట్టు ఎకాలజీ డైరెక్టర్ వైవి.మల్లారెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వాతావరణ అనుకూల గ్రామాభివృద్ధి ప్రణాళిక గురించి ఐఐఎస్‌సి శాస్త్రవేత్త ప్రొఫెసర్ ఎన్‌హెచ్ రవీంద్రనాథ్, వాతావరణ మార్పులపై ఐఐఎస్‌సి శాస్త్రవేత్త సుస్మ పాల్గొని ప్రసంగిస్తారు. మధ్యాహ్నం నుంచి డాక్టర్ విజయశంకర్ బాబు డ్రైల్యాండ్ అగ్రికల్చర్‌లో చేపట్టాల్సిన చర్యలపై వివరించనున్నారు. డ్రౌట్ మిటిగేషన్ ప్రాక్టీసెస్‌పై డాక్టర్ యలమందారెడ్డి వివరించనున్నారు. రెండో రోజు సదస్సుల్లోనూ వాతావరణ మార్పుల నేపథ్యంలో గ్రామంలో సుస్థిర అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించనున్నారు.



పెనుకొండ కోసం.. మాజీల పట్టు..!

వేరే ప్రాంతాల నుంచి వచ్చిన ఇద్దరు మాజీ మంత్రులు పెనుకొండ నియోజకవర్గం కోసం పాకులాడుతున్నారు. నువ్వా..నేనా అంటూ ఈ నేతలు పట్టుకోసం పోటీ పడుతున్నారు. నియోజకవర్గం నా సొంతం అని ఒకరు అంటుంటే.. లేదు పార్టీనే నన్ను పంపిందంటూ మరొకరు చెలరేగిపోతున్నారు. ఇద్దరూ నేతలు వేరువేరుగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. వీరిద్దరి తీరుపై సొంత పార్టీ కింది స్థాయి నాయకులు, కార్యకర్తల నుంచే వ్యతిరేకత వ్యక్తం అవుతోంది. ఇద్దరు నేతలు స్థానికులు కాకపోయినా ఇంతలా పోటీ పడుతుడడం రాజకీయ వర్గాలను సైతం విస్మయానికి గురి చేస్తోంది.

ప్రజాశక్తి-పెనుకొండ

పెనుకొండ నియోజకవర్గం కోసం వైసిపి మాజీ మంత్రులు మాలగుండ్ల శంకర నారాయణ, ఉషశ్రీ చరణ్‌ల మధ్య కొన్నాళ్లుగా పెద్ద ఎత్తునే పోరు నడుస్తోంది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఓటమి తర్వాత మాజీలు ఒక్కొక్కరూ వైసిపిని వీడుతున్నారు. పెనుకొండలో మాత్రం శంకరనారాయణ, ఉషశ్రీ చరణ్‌ల కథ మరోలా ఉంది. ఈ ఇద్దరు వైసిపి నాయకులు పెనుకొండ తనదంటే తనదని పోటీ పడుతున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి మంత్రులైన వీరిద్దరూ పెనుకొండ నియోజకవర్గం కోసం పంతం పట్టుకు కూర్చోవడం గమనార్హం.

శంకరన్నపై వ్యతిరేకత

శంకరనారాయణ మంత్రిగా ఉన్న సమయంలో సొంతపార్టీ నాయకులను లెక్క చేయకపోవడం, స్వలాభం చూసుకోవడం లాంటి విమర్శలు ఆయనపై ఉన్నాయి. ఆయనతోపాటు సోదరుల వ్యవహారశైలిపై కూడా సొంతపార్టీ నాయకులు తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. ఐదేళ్ల తర్వాత ఇదిమరింత ఎక్కువ కావడంతో 2024లో పెనుకొండ నియోజకవర్గం నుంచి శంకర నారాయణను అనంతపురం పార్లమెంట్‌కు మార్చారు. అయిష్టంగా పార్లమెంట్‌కు పోటీ చేసిన ఆయన ఓటమి తర్వాత తిరిగి సొంత నియోజకవర్గం పెనుకొండకు వచ్చారు.

ఇద్దరూ స్థానికేతరులే..!

మాజీ మంత్రి మాలగుండ్ల శంకరనారాయణ సొంతూరు ధర్మవరం. వైసీపీ ఆవిర్భావం నుంచి ఆపార్టీలో కొనసాగు తున్నారు. సుధీర్ఘకాలం పాటు వైసీపీ జిల్లా అధ్యక్షునిగా పని చేశారు. ధర్మవరంలో కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఉండటంతో శంకరనారాయణ మరో నియోజక వర్గం ఎంచుకోవాల్సి వచ్చింది. అందులో భాగంగానే పెనుకొండకు వచ్చారు. బద్దలు కొట్టారు. కుల సమీకరణలో అదృష్టం కలసి వచ్చి జగన్ క్యాబినెట్‌లో మంత్రి కూడా అయ్యారు. మూడేళ్ల పాటు మంత్రిగా కొనసాగారు. మంత్రి వర్గ పునర్వ్యస్థీకరణలో పదవి కోల్పోయారు. శంకర నారాయణ స్థానంలో అదే సామాజిక వర్గానికి చెందిన ఉషశ్రీ చరణ్‌కు మంత్రి పదవి లభించింది. కళ్యాణదుర్గం ఎమ్మెల్యేగా ఉన్న ఈమెకు రాజకీయ సమీకరణలో భాగంగా వైసిపి అధిష్టానం 2024లో పెనుకొండ టికెట్టు ఇచ్చి అక్కడి నుంచి పోటీ చేయించింది. ఈ ఎన్నికల్లో ఆమె ఓటమి చవి చూసింది. ఇక పెనుకొండ నుంచి స్థానం మారి అనంత పార్లమెంట్‌కు పోటీ చేసిన శంకర నారాయణ కూడా ఓటమి చెందారు.

ఎన్నికల ముందు కలిసి మాట్లాడుతున్న ఉషశ్రీచరణ్, శంకర నారాయణ(ఫైల్‌ఫొటో)

కురుబ సామాజికవర్గం శంకరనారాయణకు బాగా కలసి వచ్చింది. శంకరనారాయణ 2014లో ఓడిపోయినా 2019లో పెనుకొండలో గెలిచి టిడిపి కంచుకోటను

ఉషశ్రీ చరణ్‌ది అదే తీరు..

ఉషశ్రీచరణ్ మంత్రి అయ్యాక తన రూటే సపరేటు అన్నరీతిలో వ్యవహరించినట్లు తెలుస్తోంది. దీంతో కళ్యాణదుర్గంలో ఆమెపై వ్యతిరేకత మరింత పెరిగింది. సొంతపార్టీ నాయకులు, కార్యకర్తలను వేధించినట్లు ఆరోపణలున్నాయి. ఆర్థికంగా, ఆస్తులపరంగా, పదవులు ఇలా అన్ని విషయాల్లో సొంతపార్టీ నాయకులను లక్ష్యం చేసినట్లు ఆమెపై విమర్శలున్నాయి. ఆమె వ్యతిరేకంగా రెండేళ్ల లోపే సొంత పార్టీ నాయకులు ఆందోళనలు చేశారు. అధిష్టానానికి ఫిర్యాదులు మీద ఫిర్యాదులు చేశారు. ఈ నేపథ్యంలోనే జగన్ ఆమెను పెనుకొండకు పంపారు. పెనుకొండలో గెలుపుకోసం ఆమె ఎంత శ్రమించినా ఓడిపోక తప్పలేదు.

రెండు గ్రూపులుగా సమావేశాలు

ఇద్దరు మాజీ మంత్రులు ఓటమి తర్వాత పెనుకొండలో రాజకీయం చేయడానికి సిద్ధమయ్యారు. శంకరనారాయణ సొంత గృహం ఉండటంతో పెనుకొండలోనే మకాం వేశారు. ఆయన అనుచరులు ఎప్పటికప్పుడు కలుస్తూ రాజకీయ అంశాలు చర్చలు జరుపుతున్నారు. అధిష్టానం పిలుపునిచ్చే కార్యక్రమాలను తన వర్గం ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో చేస్తున్నారు. ఉషశ్రీచరణ్ ఎన్నికల ముందు పెనుకొండలో అద్దెఇంట్లో నివాసం ఉన్నారు. ఎన్నికల అనంతరం ఇంటిని ఖాళీ చేశారు. పార్టీ కార్యాలయం కూడా ఖాళీ చేసి మరో చోట అద్దెకు తీసుకున్నారు. తిరుమల లడ్డూ వివాదంపై దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేయాలని అధిష్టానం పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమాన్ని శంకరనారాయణ, ఉషశ్రీ గ్రూపులు వేరువేరుగా నిర్వహించారు. ఇలా ప్రతి కార్యక్రమాన్ని వేరువేరుగానే చేస్తున్నారు.

ఇద్దరిపైన సొంతపార్టీలో వ్యతిరేకత

2024 ఎన్నికల్లో ఇద్దరు నేతలూ ఓటమి పాలయ్యారు. అనంతరం ఈ ఇద్దరూ పెనుకొండ కోసమే పట్టుబడుతున్నారు. నియోజకవర్గంలో ఈ ఇద్దరు నేతలతో పార్టీ రెండు గ్రూపులుగా విడిపోయింది. ఇద్దరు నేతలనూ వ్యతిరేకించేవారు, సమర్థించేవారు పార్టీలో ఉన్నారు. ఇద్దరు నేతల మధ్య పార్టీ క్యాడర్ సైతం తీవ్ర గందరగోళంలో ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో వైసిపి అధిష్టానం పెనుకొండ నియోజకవర్గంకు ఎవరు బాధ్యులో ప్రకటించాలనే వాదన ఆ పార్టీ నాయకులు, కార్యకర్తల నుంచి విన్పిస్తోంది.

పెనుకొండకు ఉషశ్రీ వద్ద అంటూ ఎన్నికల ముందు ఆందోళన చేస్తున్న వైసిపి నాయకులు (ఫైల్‌ఫొటో)

చేతికందని వేరుశనగ

గత వారం జడివానతో పంటనష్టం

కాతలేని వేరుశనగ పంట

ప్రజాశక్తి-మడకశిర

మడకశిర నియోజకవర్గ వ్యాప్తంగా గత వారంలో కురిసిన వర్షాలకు వేరుశనగ రైతులు పంటలను నష్టపోయారు. మడకశిర, రొళ్ల, ఆకలి, గుడిబండ, అమరాపురం, మండలాల్లో రైతులు వేరుశనగ పంటను ఎక్కువగా సాగు చేస్తున్నారు. విత్తన సాగు సమయంలో సకాలంలో వర్షం రాకపోవడంతో అప్పుడే సాగుపై ప్రభావం పడింది. వచ్చిన అరకొర వర్షానికే రైతులు విత్తనాలు వేశారు. తీరా పంట చేతికొచ్చే సమయంలో వారం రోజుల పాటు పట్టుకున్న జడివాన ఉన్న కాస్త పంటను కూడా చేతికందకుండా చేసింది. సరైన దిగుబడి రాదన్న కారణంతో చాలా మంది రైతులు పంటను తొలగించేందుకు సిద్ధం అవుతున్నారు. ప్రతి ఏడాదీ రైతులు ఏదో విధంగా పంటలు నష్టపోయే పరిస్థితి రావడంతో అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. మడకశిర మండల పరిధిలోని గుర్రపుకొండ గ్రామానికి చెందిన రైతు రంగప్ప తన ఆరు ఎకరాల పొలంలో వేరుశనగ పంట సాగు చేశాడు. గత వారంలో కురిసిన జడివానకు పంట పూర్తిగా తడిసిపోయింది. దీంతో పంట మొత్తం చేతికందకుండా పోయింది. ఇలా చాలా మంది రైతుల పంటలు చేతికందకుండా పోయాయి. ప్రభుత్వం స్పందించి పంట నష్టపోయిన వారిని ఆదుకోవాలని నియోజకవర్గ రైతులు కోరుతున్నారు.

4 నుంచి 'పల్లె పండుగ' : కలెక్టర్

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ఈ నెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు వారం రోజుల పాటు 'పల్లె పండుగ' పేరుతో కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ చేతన్ తెలిపారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివద్ధి శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ రాష్ట్ర సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో పల్లె పండుగ కార్యక్రమాలపై మంగళవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్థానిక కలెక్టరేట్లోని కోర్టు హాలు నందు వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ చేతన్ మాట్లాడుతూ పల్లె పండుగ నిర్వహణకు జిల్లాలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. అన్ని పంచాయతీల పరిధిలో 990 పనులను గుర్తించి, వాటికి సంబంధించి రూ.62 కోట్లు అంచనాలు వేసినట్లు తెలిపారు. ఇప్పటివరకు కొన్ని పనులకు సంబంధించి ప్రతిపాదనలకు అనుమతులు ఇచ్చి, అప్లోడ్ చేశామని, మిగిలినవి రానున్న రెండు రోజుల్లో పూర్తి చేస్తామని వివరించారు. ఆయా పనులకు ఎలాంటి ఇసుక కొరత లేదని చెప్పారు. ఈ సమావేశంలో ద్వామా పీడీ విజయేంద్రప్రసాద్, డిపిఒ సమత పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న అధికారులు

ఖాళీగా తహశీల్దార్ కార్యాలయం

15 రోజులుగా ఆర్డీవో కార్యాలయంలోనే రెవెన్యూ సిబ్బంది
ఇబ్బందులు పడుతున్న మండల ప్రజలు

జూనియర్ అసిస్టెంట్ మినహా ఖాళీగా ఉన్న తహశీల్దార్ కార్యాలయం

ప్రజాశక్తి - చిలమత్తూరు

చిలమత్తూరు తహశీల్దార్ కార్యాలయం గత 15 రోజులుగా ఖాళీ కుర్చీలతో దర్శనం ఇస్తోంది. రెగ్యులర్ తహశీల్దార్ ఆనంద్ కుమార్ ఆర్డీవోగా ఉద్యోగోన్నతి పొంది పెనుకొండకు బదిలీ అయ్యారు. ఆ స్థానంలో లేపాక్షి తహశీల్దార్‌లో ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పజెప్పారు. అయితే సుమారు 15 రోజులుగా ఫ్రీహోల్డ్ భూముల వెరిఫికేషన్ కోసం వీఆర్వోలు, డిప్యూటీ తహశీల్దార్, కార్యాలయంలోని సీనియర్ అసిస్టెంట్, సిబ్బంది పెనుకొండ ఆర్డీవో కార్యాలయం వద్దే ఉంటున్నారు. దీంతో అధికారులు లేక తహశీల్దార్ కార్యాలయం వెలవెల బోతోంది. వివిధ పనులపై 84 గ్రామాల నుండి తహశీల్దార్ కార్యాలయానికి వస్తున్న ప్రజలు నిరాశతో వెనుతిరుగుతున్నారు. మంగళవారం కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్, గ్రామ సహాయకులు(విఆర్ఎ) మినహా కార్యాలయంలో ఎవరూ లేరు. కుల,ఆదాయ ధృవీకరణ పత్రాలు, బ్యాంక్ రుణాల కోసం అడంగల్ అన్ లాక్, ముటేషన్ కోసం వచ్చే రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిలమత్తూరు తహశీల్దార్ కార్యాలయంలో ఎప్పటి నుండో ఆర్ఐ పోస్ట్ ఖాళీగా ఉంది.కనీసం తమ సమస్యలను పరిష్కరించడానికి కాని వినడానికి కాని కార్యాలయంలో ఒక ఉన్నత అధికారి కూడా లేరని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నత అధికారులు చొరవ చూపి కార్యాలయంలో జవాబుదారిగా ఒక్క ఉన్నత అధికారైన ఉండేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

నగల కోసమే సిఐ తల్లి హత్య

నమ్మిన యువకుడే ఆయువు తీశాడు..
12 రోజుల తర్వాత వీడిన ధర్మవరం సిఐ తల్లి అదృశ్యం మిస్టరీ

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

ఒంటరిగా ఉన్న మహిళకు చేదోడు వాదోడుగా ఉంటానన్న యువకుడు నమ్మించి నట్టేట ముంచాడు. ఆమె వద్ద ఉన్న నగదు, నగల కోసం ఆశపడి ఆమెకున్న అనారోగ్యాన్ని ఎరగా చేసుకొని ఆరోగ్యం కుదుట పరుస్తానని చెప్పి మరో మిత్రుడు తో కలిసి అంతమొందించాడు. 12 రోజుల తర్వాత ఈ అదృశ్యం కేసు మిస్టరీని పోలీసులు చేదించి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. మృతురాలని పూడ్చిపెట్టిన ప్రదేశంలో నే పోస్టుమార్టం నిర్వహించి హత్య కేసు నమోదు చేశారు. కేసుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గుర్రంకొండ మండలం మేడికుర్తికి చెందిన స్వర్ణకుమారి (62) మదనపల్లి మండలం సిటిఎం చెందిన ప్యారం శ్రీరాములతో వివాహం అయింది. వీరికి కుమారుడు నాగేంద్ర ఉన్నాడు. 30 ఏళ్ల క్రితం భర్తతో స్వర్ణకుమారి విడిపోయింది. అనంతరం మదనపల్లె దేవళంవీధిలో ఇళ్లు నిర్మించుకుని ఇక్కడే స్థిరపడి కుమారుడితో కలిసి జీవించేది. కుమారుడు పోలీస్ శాఖలో ఉద్యోగం సంపాదించి ప్రస్తుతం ధర్మవరం సిఐగా విధులు నిర్వహిస్తున్నాడు. ఆ తరువాత స్వర్ణకుమారి జగన్ కాలనీలో ఓ ఇంటిని నిర్మించి అక్కడ నివాసం ఉంటోంది. అదే ప్రాంతంలో ఉన్న మేడికుర్తి కి చెందిన సురేంద్ర, యల్లమ్మ దంపతుల కుమారుడు వెంకటేష్ స్వర్ణకుమారికి చేదోడు వాదోడు గా ఉంటూ అప్పుడప్పుడు పనుల్లో సహాయ పడేవాడు. ఈ క్రమంలో స్వర్ణకుమారి వద్ద ఉన్న నగదు, నగలపై ఆశపడ్డాడు. ఎలాగైనా వాటిని కొట్టేయాలని పథకం పన్నాడు స్థానిక గజ్జలకుంటలో ఉన్న అనిల్ తో కలిసి నగదు, నగలు దోచుకునేందుకు పథకం పన్నాడు. నాటు వైద్యం చేసి మంత్రించేవారు నాకు తెలుసని, అక్కడికి వెళ్తే ఆరోగ్యం నయమౌతుందని స్వర్ణకుమారి ని వెంకటేష్ నమ్మించాడు. ఈ క్రమంలో సెప్టెంబర్ 28వ తేదీన తన ద్విచక్ర వాహనంలో స్వర్ణకుమారిని ఎక్కించుకొని గజ్జల కుంటలో ఉన్న అనీల్ ఇంటికి వెళ్లాడు. అనిల్ ఇంట్లో మంత్రాలు చదువుతూ స్వర్ణకుమారి పూజలో నిమగ్నమైన సమయంలో సుత్తితో ఆమె తలపై మోది హత్య చేశారు. అనంతరం ఆమె మృతదేహాన్ని ఓ గోనెసంచిలో వేసి, ఆరోజు రాత్రి నీరుగట్టు వారిపల్లి సమీపంలోని స్మశాన వాటికలో అప్పటికే శవాన్ని పూడ్చి ఉన్న ఓ గుంతను తవ్వి అందులో గోనె సంచితో పాటే మృతదేహాన్ని వేసి కప్పెట్టేసి అక్కడి నుంచి పరారయ్యారు. అక్కడి నుంచి నేరుగా తిరుపతికి వెళ్లి రేణిగుంట లో ఫ్లైట్ ద్వారా బెంగళూరుకు చేరుకొని బెంగళూరు నుంచి రాజస్థాన్ కు పరారయ్యారు. తల్లి అదృశ్యం కావడంతో కుమారుడు నాగేంద్ర అక్టోబర్ 1 వ తేదీన తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అదృశ్యం కేసు నమోదు చేసిన పోలీసులు వివిధ కోణాల్లో దర్యాప్తును ప్రారంభించారు. నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారిచ్చిన సమాచారంతో మంగళవారం నీరుగట్టువారి పల్లి శ్మశాన వాటికలో డీఎస్పీ కొండయ్య నాయుడు, తహశీల్దార్ ఖాజాబీ ఆధ్వర్యంలో మృతదేహాన్ని వెలికి తీసి అక్కడే పోస్ట్ మార్టం నిర్వహించారు. మృతదేహాన్ని కుమారుడు నాగేంద్ర కు అప్పగించారు. ఆయన తన కుటుంబ సభ్యులతో కలిసి అదే ప్రాంతంలో తల్లికి అంత్యక్రియలు నిర్వహించాడు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వలస కూలీలు మృతి

ప్రజాశక్తి - తలుపుల

ఉపాధి కూలి కోసం వచ్చిన ఇద్దరు వలసకూలీలు రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన సంఘటన తలుపుల మండలం నూతన కాలువ పంచాయతీ తొగట వారి పల్లి గ్రామ సమీపంలో మంగళవారం చోటు చేసుకుంది. కదిరి అప్ గ్రేడ్ సిఐ మోహన్, ఎఎస్ఐ కృష్ణారెడ్డి తెలిపిన వివరాల మేరకు తలుపుల మండలం తొగటివారిపల్లి నుంచి వెలిచలములకు విద్యుత్ సామాన్లు ట్రాక్టర్ మీదుగా తీసుకెళు తుండగా తొగటవాండ్లపల్లి సమీప మార్గమధ్యలో మలుపు వద్ద ఓబుల రెడ్డి పల్లి నుంచి తలుపులకు వస్తున్న ఆటోను తప్పించబోయి ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన ఇద్దరు యువకులు డానియాల్ (29), సునీల్ (26) అక్కడికక్కడే మృతిచెందారు. ప్రమాదంలో మరో ఐదుగురు తీవ్రంగా గాయపడటంతో వారిని కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

జాతీయ స్థాయి పోటీల్లో చిగిచెర్ల విద్యార్థి ప్రతిభ

ధర్మవరం రూరల్ : జాతీయ స్థాయి అండర్ - 14 జూడో పోటీలలో చిగిచెర్ల ప్రభుత్వ పాఠశాల విద్యార్థి అఫ్జల్ మెహారాజ్ ప్రతిభ కనపర్చాడు. అక్టోబర్ 4 నుంచి 8 తేదీ వరకు గుజరాత్ రాష్ట్రంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జరిగిన 68 వ జాతీయ స్కూల్ గేమ్స్ పోటీలలో 50 కేజీల విభాగంలో అఫ్జల్ మెహరాజ్ కాంస్య పతకం సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు తిమ్మారెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ ప్రతాప్ రెడ్డి తెలిపారు. దేశంలోని ఇరవై ఆరు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థి కాంస్య పతకం సాధించడం గర్వకారణమన్నారు.

విద్యార్థులు శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

బుక్కపట్నం : నేటితరం విద్యార్థులు శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించుకొని పరిజ్ఞానాన్ని పెంపొందించు కోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మక్బూల్ హుస్సేన్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన సైన్స్ అండ్ రిలీజియన్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీకాకుళం జిల్లా తొగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్రీయ విజ్ఞానం పై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ఓబిలేసు, దస్తగిరి, గంగరాజు, శ్రీనివాసులు, భాస్కర్ నాయక్ పాల్గొన్నారు.

రైతులకు సున్నా వడ్డీ రుణాలు అందించాలి

హిందూపురం : వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్న రైతులందరికీ కేంద్ర, ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు ఎలాంటి వడ్డీ లేకుండా బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేయాలని భారతీయ కిసాన్ రైతు సంఘం ఆంధ్ర ప్రదేశ్ అధ్యక్షులు దాళవాటం సోమశేఖర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రైతుల సమస్యలపై భారతీయ కిసాన్ యూనియన్ (ఎ) ఆధ్వర్యంలో మంగళవారం ఢిల్లీలోని విజయ్ ఘాట్‌లో నిర్వహించిన సదస్సులో సోమశేఖర్ రెడ్డి పాల్గొన్నారు. రైతుల శ్రేయస్సు కొరకు తీసుకున్న నిర్ణయాల సాధన కోసం నవంబర్ 10వ తేదీన ఢిల్లీలోని జంతర్ మంతర్ నందు భారతదేశ నలమూలన నుండి లక్ష మంది రైతులతో భారతీయ కిసాన్ యూనియన్ (ఎ) ఆధ్వర్యంలో మహాధర్నా కార్యక్రమం జరిపేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. తమ డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం అంగీకరించే వరకు పోరాటం చేస్తామని సంకల్పం తీసుకున్నట్లు చెప్పారు.

గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎంపిడిఒ

ఉపాధి పనుల పరిశీలన

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఎంపీడీవో పోలప్ప మంగళవారం పరిశీలించారు. పంచాయతీ పరిధిలో ఉపాధి హామీ పథకం కింద మంజూరైన ఉద్యాన పంటల్లో భాగంగా పూల మొక్కలు సాగు చేసిన రైతు పొలాన్ని పరిశీలించారు. అదే విధంగా మైరాడా ఆఫీస్ వెనక ఉన్న హిందూ స్మశాన వాటిక స్థలాన్ని పరిశీలించారు. గంగనగారిపల్లి దగ్గర చంద్రన్న హౌసింగ్ కాలనీ ఇళ్ల నిర్మాణానికి విద్యుత్తు లైన్లు ఆటంకంగా ఉన్నాయని ప్రజలు ఫిర్యాదు చేయగా ఆస్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్ బదిలీ

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి మున్సిపల్ కమిషనర్ కిరణ్ కుమార్ బదిలీ అయ్యారు. ఈమేరకు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ సాధారణ పరిపాలన శాఖ ఉన్నతాధికారులు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన గతంలో ఉద్యాన శాఖలో అసిస్టెంట్ డైరెక్టర్ గా విధులు నిర్వహించేవారు. ప్రస్తుతం మాతృశాఖలో రిపోర్ట్ చేసుకోవాల్సిందిగా ఆదేశాలు ఇచ్చారు.

బదిలీ అధికారికి సన్మానం

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

శ్రీ సత్య సాయి జిల్లా పంచాయతీ ఏవో నాగరాజు బదిలీపై వెళుతున్న సందర్భంగా జిల్లా పంచాయతీ కార్యాలయ సిబ్బంది ఆయనను మంగళవారం ఘనంగా సన్మానించారు. డిపిఒ సమత, సీనియర్ అసిస్టెంట్ చాసావలి, కే మహేష్ ఇతర సిబ్బంది ఎఒ నాగరాజును శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. ఎఒ నాగరాజు ఇక్కడి నుండి అనంతపురం డిపిఒ కార్యాలయానికి బదిలీపై వెళుతున్న తరుణంలో ఏర్పాటు చేసిన వీడ్కోలు సభలో డిపిఒ సమత మాట్లాడుతూ నాగరాజు అందించిన సేవలను కొనియాడారు.

ఎపిఎంగా నారాయణ

ప్రజాశక్తి - కొత్తచెరువు

కొత్తచెరువు ఎపిఎంగా నారాయణ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. గోరంట్లలో పనిచేస్తున్న ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఎపిఎం రవీందర్ రెడ్డి బుక్కపట్నం బదిలీ అయ్యారు ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ మండలంలోని మహిళా సంఘాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు.

గ్రంథాలయం తనిఖీ

ప్రజాశక్తి - తనకల్లు

మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయాన్ని గ్రంథాలయ జిల్లా కార్యదర్శి రమ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె పలు రికార్డులను పరిశీలించారు. గ్రంథాలయ సెస్సు వసూలుకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి మస్తాన్‌వలి, పాఠకులు పాల్గొన్నారు.

గంగమ్మ జాతర

ప్రజాశక్తి - రొద్దం

మండలంలోని దొడగట్ట గ్రామంలో గంగమ్మ జాతర మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హిందూపురం పార్లమెంటు సభ్యులు బికె. పార్థసారథి హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరసింహులు, వెంకటరామిరెడ్డి, జివిపి నాయుడు, రామచంద్ర, వెంకీ, మురళి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షిలో శరన్నవరాత్రులు

ప్రజాశక్తి - లేపాక్షి

మండలంలోని దుర్గా వీరభద్ర స్వామి ఆలయంలో విజయదశమి పురస్కరించుకొని శరన్నవరాత్రులలో భాగంగా ఆరవ రోజు శ్రీ దుర్గా దేవి అమ్మ వారు శ్రీ రాజరాజేశ్వరి దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. ఆలయ సందర్శనకు విచ్చేసిన భక్తులకు అన్నసమర్పణ కార్యక్రమం నిర్వహించినట్లు లేపాక్షి ఆలయ కమిటీ చైర్మన్ కరణం రమానందన్ తెలిపారు.

మహిళకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - లేపాక్షి

కొద్ది రోజుల క్రితం కురిసిన వర్షాలకు మండలంలోని కోడిపల్లికి చెందిన గొల్ల లక్ష్మమ్మ అనే మహిళకు చెందిన ఇంటి పైకప్పు కూలిపోయింది. మహిళ పరిస్థితిని గ్రామస్తులు లేపాక్షి ఆలయ చైర్మన్ కరణం రమానందన్ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించిన ఆయన బాధితురాలికి సాయం చేశారు. తనవంతుగా రూ. 10వేలను అందజేశారు. ఈ కార్యక్రమం లో కోడిపల్లి మాజీ సర్పంచి నాగరాజు, డీలర్ రాజశేఖర్ రెడ్డి, ఎంపీటీసీ గంగాధర్, గ్రామస్తులు, రమానందన్ మిత్రమండలి సభ్యులు చిన్నకృష్ణ, భరత్, అనిల్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నియామక ఉత్తర్వులు అందజేత

ప్రజాశక్తి -పెనుకొండ

బ్యాక్‌లాగ్ పోస్టింగ్‌లో నియామకమైన ఎన్.అపర్ణకు పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం ఆర్డీవో టి.ఆనంద్ కుమార్ పోస్టింగ్ ఆర్డర్‌ను అందజేశారు. ఈ మేరకు ఆమెకు అమరాపురం మండలం ఆఫీస్ సబార్డినేట్‌గా ఆర్డీవో పోస్టింగ్ ఇచ్చారు. విధులు సక్రమంగా నిర్వర్తిస్తూ మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. అపర్ణ ఆర్డీవోకి కృతజ్ఞతలు తెలిపారు.



నియామక ఉత్తర్వులు అందజేస్తున్న ఆర్డీవో

నిర్లక్ష్యం వీడని సచివాలయ కార్యదర్శులు

హాజరుకే కాదు సచివాలయానికీ రాని వైనం

సెక్రటరీ లేక మూతపడిన సచివాలయ భవనం

ప్రజాశక్తి-హిందూపురం

నిర్లక్ష్యానికి నిదర్శనం సచివాలయ అమ్యూనిటీ సెక్రటరీలు అనే విమర్శలు విన్పిస్తున్నాయి. కనీస పనులు సైతం చేయకుండా ఉదయం, సాయంత్రం రెండు పూటలా హాజరు వేసి, వేతనాలను తీసుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం సచివాలయ సెక్రటరీల సేవలను వినియోగించుకోవాలని ఆయా సచివాలయాలలో విధులు నిర్వహించే ఆయా విభాగాల సెక్రటరీలకు నూతన మార్గదర్శకాలను జారీ చేసింది. దీంతో మునిసిపల్ కమిషనర్ సంగం శ్రీనివాసులు, మున్సిపల్ ఇంజనీర్లు పురపాలక సంఘ వ్యాప్తంగా ఉన్న అమ్యూనిటీ సెక్రటరీలతో గతవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించి ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాలను, వారు నిర్వర్తించాల్సిన విధుల గురించి వివరించారు. సక్రమంగా విధులు నిర్వర్తించకపోతే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అయినప్పటికీ పురపాలక సంఘ వ్యాప్తంగా విధులు నిర్వహిస్తున్న అమ్యూనిటీ సెక్రటరీలు అధికారుల ఆదేశాలను బేఖాతారు చేస్తున్నారు. వారు వచ్చిందే సమయం.... చేసిందేఉద్యోగం అన్న విధంగా అమ్యూనిటీ సెక్రటరీలు విధులు నిర్వహిస్తున్నారు.

హిందూపురం పురపాలక సంఘంలో 43 సచివాలయాలు ఉన్నాయి. ప్రతి సచివాలయంలోనూ ఆయా విభాగాలకు సంబంధించిన పది మంది సెక్రటరీలు విధులు నిర్వహిస్తున్నారు. ఇందులో అమ్యూనిటీ సెక్రటరీలు వారు విధులు నిర్వహించే సచివాలయల పరిధిలో తాగునీటి సరఫరా, పైప్ లైన్ మరమ్మతులు, మురుగు కాలువలు, రోడ్లు, కల్వర్టులు, వీధి దీపాల నిర్వహణ, డిసిల్టేషన్ తదితర పనులతో పాటు ప్రతి రోజు ఉదయం అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగుల హాజరును ఆయా సచివాలయాల్లోనే తీసుకోవాల్సుంది. వార్డులో పర్యటించి అభివృద్ధి పనులకు సంబంధించిన ఎస్టిమేషన్ సిద్ధం చేసి పురపాలక సంఘానికి పంపాలి. ఆయా వార్డుల్లో చేపడుతున్న అభివృద్ధి పనులకు సంబంధించి ఎం బుక్ లో నమోదు చేయాల్సిన బాధ్యత అమ్యూనిటీ సెక్రటరీలపై ఉంది. వీటితో పాటు జరుగుతున్న అభివృద్ధి పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి నిర్దేశించిన గడువులోగా పనులను పూర్తి చేయించాల్సి ఉంది. అయితే ప్రతి రోజు ఉదయం 7 :30గంటలకు అమ్యూనిటి సెక్రెటరీలు ఆయా సచివాలయాల వద్ద వారి పరిధిలో ఉన్న వీధి దీపాలు, వాటర్ మ్యాన్, తదితర అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల హాజరు తీసుకోవాల్సి ఉంది. అయితే వారు ఉదయం 8 : 30 గంటలు అయినప్పటికి సచివాలయానికి వచ్చి వారి హాజరు తీసుకోవడం లేదు. దీంతో ఎవరు ఎక్కడికి వెళుతురన్నారో అర్థం కావడం లేదు. గత నాలుగు రోజులుగా పట్టణ వ్యాప్తంగా నీటి సమస్య తీవ్రం అయింది. వెంటనే సచివాలయాల పరిధిలో అమ్యూనిటి సెక్రటరీలు పర్యటించి, ప్రత్యామ్నాయంగా ట్యాంకర్లను ఏర్పాటు చేసి, నీటి సరఫరా చేసి సమస్యను పరిష్కరించాల్సి ఉంది. అయినా తమకు ఎందుకు అనే విధంగా వీరు విధులు నిర్వర్తిస్తున్నారు. ఇప్పటికైన మున్సిపల్ కమిషనర్, ఇంజనీర్లు వీరి పనివిధానాన్ని సమీక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

అసోసియేషన్‌కు రాజకీయరంగు పులమడం సరికాదు

ప్లంబర్స్ , ఎలక్ట్రీషియన్ యూనియన్

విలేకరుల సమావేశంలో పాల్గొన్న యూనియన్ సభ్యులు

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

తమ సమస్యకు రాజకీయరంగు పులమడం సరికాదని ప్లంబర్స్ అండ్ ఎలక్ట్రీషియన్ అసోసియేషన్ నాయకులు అన్నారు. ఈ మేరకు వారు మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు రాజు, ఉపాధ్యక్షులు సురేంద్ర వారు మాట్లాడుతూ కొందరు వ్యక్తులు సోమవారం ఏర్పాటు చేసి తమదే అసలైన యూనియన్ అని ప్రకటించారన్నారు. ఇందులో ఎలాంటి వాస్తవం లేదన్నారు. ఆ సమావేశంలో తమపై ఆరోపణలు చేసిన వారు రాజకీయ ప్రేరేపిత వ్యక్తులని చెప్పారు. వారికీ తమకు ఎలాంటి సంబంధం లేదన్నారు. గొడుగు నాగరాజు సోము అనే వ్యక్తులు తమకు యాభై లక్షల రూపాయలు ఇవ్వాలని లేకపోతే పన్నెండు ప్లాట్లు అయినా ఇవ్వాలని డిమాండ్ చేసారని ఇది ముమ్మాటికీ వాస్తవమని అన్నారు. తమ అసోసియేషన్‌కి ఎలాంటి రాజకీయ పార్టీలతో సంబంధం లేదన్నారు. 2002 సంవత్సరములో ఇక్కడ అప్పటి కలెక్టర్ తమకు రెండు ఎకరాల స్థలం కేటాయించారన్నారు. అప్పటికి వున్న సభ్యులు ప్రకారం ఒకరికి 2.50 సెంట్లు చొప్పున పట్టాలు ఇచ్చారన్నారు. అదేవిదంగా అసోసియేషన్‌లో సభ్యులు సంఖ్య ఎక్కువ అయినప్పుడు స్థలాన్ని కూడా సర్దుబాటు చేసుకున్నామని ఇప్పటికి ఒక్కొక్కరికి 1. 1/4 సెంట్ల ప్రకారం ఉందని తెలిపారు. ఈ భూమి విషయమై కొందరు గతంలో తమను ఎన్నో ఇబ్బందులు పెట్టారని చెప్పారు. పెనుగొండ కోర్టు, ధర్మవరం కోర్టు, అమరావతి కోర్టు లలో తాము గెలిచి ఇక్కడ తమ ప్లాట్లను కాపాడుకున్నామన్నారు. ఎన్నో వ్యయ ప్రయాసలు పడి సాధించిన తరువాత తమ స్థలాల్లో గృహనిర్మాణాలు చేసుకుంటుంటే గొడుగు నాగరాజు, సోము, బాలకృష్ణ అనే వ్యక్తులతో పాటు మరి కొందరు వచ్చి కట్టడాలను అన్యాయంగా కూల్చివేశారని వాపోయారు. అలాంటి వారికి కొంతమంది వత్తాసు పలకడం సిగ్గుచేటన్నారు. అసోసియేషన్ లోని కార్మికులకు న్యాయం జరిగే వరకు తామంతా ఏక తాటిపై ఉండి పోరాడుతామని చెప్పారు. ఈ సమావేశంలో ప్లంబర్స్, ఎలక్ట్రీషియన్ అసోసియేషన్ కోశాధికారి ఇస్మాయిల్, అనిల్ కుమార్, జామిర్, లతీఫ్, వీరారెడ్డి, జావీద్, అంజి, జిలాన్, అజయకుమార్, మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

నిరసన వ్యక్తం చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

కొనసాగిన ఆర్టీసీ ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

పెంచిన పనిభారాన్ని నిరసిస్తూ ధర్మవరం ఆర్‌టిసి డిపో ముందు మూడవ రోజు నల్లబ్యాడ్జి లతో ఉద్యోగులు విధులకు హాజరయ్యారు. ఎపిపిటిడి ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో చేస్తున్న ఈ నిరసన కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఏ డిపో లేని విధంగా ఒటి శాతం 47 అధికంగా ఉందన్నారు. ఇది చాలదన్నట్టు మరింత పని భారాన్ని పెంచి ఉద్యోగులను మానసికంగా వేధిస్తున్నారని విమర్శించారు. వయసు మీద పడి ఉద్యోగ విరమణ చేయడానికి సిద్ధంగా వున్న ఎంతో మంది ఉద్యోగులు, మహిళా ఉద్యోగులపై ఇలాంటి పనిభారాలు మోపడం బాధాకరమన్నారు. ఒక వైపు యాజమాన్యం 1-2019 సర్క్యులర్‌ను అమలు చేయకుండా 70-71 సర్క్యులర్ పేరిట ఉద్యోగులను మానసికంగా పనిష్‌మెంట్ రూపంలో వేధిస్తోందన్నారు. ఇకనైనా యాజమాన్యం స్పందించి పెంచిన పని బారాలు తగ్గించి భవిష్యత్తు లో ఇలాంటి నిర్ణయాలు తీసుకోకుండా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ యూనియన్ నాయకులు కెబి. నాగార్జున రెడ్డి, కార్యదర్శి జె. ముస్తఫా, ఎడిసిలు మల్లికార్జున, టిఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

భూముల పరిశీలనను త్వరితగతిన పూర్తి చేయండి

ప్రజాశక్తి - కొత్తచెరువు

గత ప్రభుత్వం చేపట్టిన ఫ్రీహోల్డ్ భూముల రీ వెరిఫికేషన్‌ను త్వరితగతిన పూర్తిచేయాలని పుట్టపర్తి ఆర్డీవో సువర్ణ వీఆర్వోలను ఆదేశించారు. ఈ మేరకు ఆమె మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆమె రికార్డులను పరిశీలించి సిబ్బందితో వివరాల అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆర్డీవో మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఫ్రీహోల్డ్ భూముల జాబితాను గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలించి అవి సక్రమంగా ఉన్నాయా లేదా అని తెలుసుకోవాలన్నారు. అవసరమైతే గ్రామసభలు కూడా నిర్వహించి ఈ సమస్యలను పరిష్కరించాలన్నారు. అలాగే మండలంలో భూములు రస్తా సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకువస్తే వాటిని పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. కొత్తచెరువులో శ్మశాన వాటిక ఏర్పాటుకు భూములను పరిశీలించి వాటి నివేదికను తయారు చేయాలని తహశీల్దార్‌ను ఆదేశించారు. గ్రామ ప్రజల అభిప్రాయాన్ని కూడా తీసుకొని శ్మశాన వాటికను ఏర్పాటు చేయాలన్నారు. ఇందుకు భూములు కోల్పోయే రైతులను కూడా పిలిపించి వారితో చర్చించాలన్నారు ఈ కార్యక్రమంలో తహశీల్దార్ నీలకంఠారెడ్డి, డిటి బాలవీరాంజనేయులు, ఆర్ఐ కిరణ్, వీఆర్వోలు వేణు, శ్రీనివాసులు, రమేష్ రెడ్డి, చెన్నయ్య, కాటమయ్య, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఆర్డీవో

గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

పొలంబడిలో పాల్గొన్న అధికారులు, రైతులు

ప్రజాశక్తి - కొత్తచెరువు

పంటసాగులో రైతులు తగిన మెళకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని జిల్లా పట్టు పరిశ్రమల శాఖ అధికారి పద్మమ్మ తెలిపారు మండల పరిధిలోని కోడపగానిపల్లిచ తిరుమల దేవరపల్లి సమీపంలోనే వేరుశనగ పంట సాగు చేసిన రైతుల పొలాల్లో పొలం పిలుస్తుంది అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖరీఫ్ లో వేరుశనగ పంట సాగు చేసే రైతులు తగిన మెలకువలు పాటించాలన్నారు, తెగుళ్ల నివారణకు సకాలంలో మందులు పిచికారి చేయాలన్నారు. బోరు బావులున్న రైతులు మల్బరీ తోటలు సాగు చేయాలని అలా చేసే రైతులకు ప్రభుత్వం సబ్సిడీపై షెడ్లు ఇతర పరికరాలు అందజేస్తుందని వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎడిఎ సనావుల్లా, అబ్దుల్ అలీ, వ్యవసాయ అధికారి నటరాజు, గ్రామ సర్పంచి అలివేలమ్మ, కేశవరెడ్డి, టిడిపి నాయకులు శివయ్య, శ్రీరాములు, చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

బుక్కపట్నం : మండలం మారాల గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం లో భాగంగా రైతులకు చీడపురుగుల నివారణపై ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ సైంటిస్ట్ రామసుబ్బయ్య మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి, మొక్కజొన్న, వేరుశనగలో వచ్చు చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు. ఈ కార్యక్రమంలోవ్యవసాయ అధికారి సతీష్ బాబు, ఉద్యాన అధికారి నవీన్ కుమార్, ఎఇఒలు సునీత, సుధా లక్ష్మి, ఆర్ ఎస్ కె అధికారి ఆర్ బాబు , సాయిరాజ్, దివాకర్, రైతులు నాగరాజు, దుర్గమప్ప తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల రూరల్ : మండల పరిధిలోని పాలసముద్రం పంచాయతీలో పలు పంట పొలాలను మండల వ్యవసాయ అధికారి మునికృష్ణ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు పలు సూచనలు చేశారు. రాగిమకుల పల్లికి చెందిన నరసింహులు రైతు పొలంలో పంట కోత ప్రయోగాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి గంగప్ప, టిడిపి రాష్ట్ర బోయ సాధికార కమిటీ సభ్యుడు బెల్లాల చెరువు చంద్ర,క్లస్టర్ ఇన్‌చార్జి మనోహర్, మూర్తి, జయచంద్రారెడ్డి, ఆదినారాయణ, అంజి, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల మీట్

ప్రజాశక్తి - తలుపుల

స్థానిక జీవనజ్యోతి మండల సమైక్య కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. ఎంపిపి మహమ్మద్ రఫీ నాయక్ అధ్యక్షతన ఎంపీడీవో రామనాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు ప్రగతి నివేదిక చదివి వినిపించారు. గత సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లిన సమస్యలు పరిష్కారం కాలేదని ప్రజాప్రతినిధులు అసహనం వ్యక్తం చేశారు. పలువురు ప్రజా ప్రతినిధులు సమావేశానికి గైర్హాజరయ్యారు.

నంబుల పూలకుంట : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ రాము అధ్యక్షతన మంగళవారం మండల సర్వ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సభ్యులు పలు సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. వైద్యులు రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని కోరారు. ఈ సమావేశంలో సర్పంచులు, ఎంపిటిసిలు, ఆయా శాఖల అధికారులు

నంబులపూలకుంటలోని మండలమీట్‌లో మాట్లాడుతున్న ఎంపిపి

ప్రేమోన్మాది ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-పెనుకొండ

ఓ వివాహిత మహిళను ప్రేమిస్తున్నా అంటూ వేధిస్తూ ఆమె తిరస్కరించడంతో ఉన్మాదిగా మారిన ఓ వ్యక్తి గొంతు కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన పెనుకొండ మండలం గుట్టూరు గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. కియా ఇండస్ట్రియల్ పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ వెంకటరమణ తెలిపిన వివరాలు... చిలమత్తూరు మండలం కొడికొండ కు చెందిన ఆలీం భాష(28) సోమందేపల్లి వద్ద ఉన్న ఎస్ఎల్ఎపి సంస్థలో పనిచేస్తున్నాడు. అదే సంస్థలో పనిచేస్తున్న గుట్టూరు గ్రామానికి వివాహితతో రెండేళ్ల కింద పరిచయం పెంచుకున్నాడు. ఈ నేపథ్యంలో ఆలీంభాష తనను పెళ్లి చేసుకోమని వివాహితను వేధించేవాడు. తనకు వివాహమైందని ఇలా చేయడం సబబు కాదని ఆలీంబాషాను ఆమె మందలించింది. మరో పక్క పెద్దలు సైతం పెళ్లయిన మహిళను ఇలా వేధించడం సబబు కాదని హితబోధ చేశారు. ఎవరు ఎన్ని చెప్పినా వినకుండా వివాహిత పట్ల అసభ్య పదజాలంతో తరచూ వేధించే వాడు. దీంతో వివాహిత మహిళ అతన్ని దూరం పెడుతోంది దీంతో ఉన్మాదిగా మారిన అలీంబాషా మంగళవారం వివాహిత గ్రామం గుట్టూరులో బ్లేడుతో గొంతు కోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు హుటా హుటిన పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వివరాలు అడిగి తెలుసుకుంటున్న పోలీసు అధికారి

వన్యప్రాణులను వేటాడితే చర్యలు

ప్రజాశక్తి - కదిరి టౌన్

వన్య ప్రాణాలను వేటాడితే కఠిన చర్యలు తప్పవని ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ హరిప్రసాద్ తెలిపారు. వన్యప్రాణి వారోత్సవాలలో భాగంగా మంగళవారం తనకల్లు మండలంలోని రాకుంటపల్లి గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ హరిప్రసాద్ మాట్లాడుతూ సమాజంలో మానవునితో పాటు వన్యప్రాణులకు జీవించే హక్కు ఉందని వన్యప్రాణులను కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని అన్నారు. వన్య ప్రాణులను వేటాడటం, లేదా బంధించడం చట్టరీత్యా నేరమని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు జెసి.వెంకటేశులు, జి.అనిల్ కుమార్, ఆర్. స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

టిడిపి నాయకుడు మృతి

ప్రజాశక్తి- కొత్తచెరువు

మండలానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు దూపంపల్లిబాషా (85) మంగళవారం మృతి చెందాడు. ఈయన గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడు తుండేవాడు.ఈ నేపథ్యంలో బీసీ కాలనీలోని తన స్వగృహంలో మంగళవారం మృతిచెందాడు. ఈయన గోరంట్ల మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కేసన్నకు ముఖ్య అనుచరుడిగా ఉండేవారు. గతంలో కమ్యూనిస్టు పార్టీ నాయకుడుగా కూడా పనిచేశారు. ఈయనకు భార్య, ముగ్గురు కూతుర్లు, ఒక కుమారుడు ఉన్నారు బాషా మృతదేహాన్ని పలువురు నాయకులు సందర్శించి నివాళులర్పించారు.

కార్మికులకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి - ముదిగుబ్బ

స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిపి గొడ్డుమర్రి ఆదినారాయణ యాదవ్ ఆధ్వర్యంలో పారిశుధ్య, నీటి సరఫరా కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. 36 మంది కార్మికులకు విజయదశమి పండుగ సందర్భంగా దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ విజయ్ భాస్కర్, ఇఒఆర్‌డి దివాకర్, పంచాయతీ సెక్రటరీ మంజుల దేవి, నాయకులు ఓబి రెడ్డి, కృష్ణమూర్తి, రాము, రమేష్ నాయుడు, పతి, చంద్ర, అమీర్, ఉత్తప్ప తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఎంపిపి

చేపల పెంపకానికి వేలంపాట

ప్రజాశక్తి - అగళి

మండల పరిధిలోని రావుడి చెరువులో చేపల పెంపకానికి మంగళవారం వేలం పాట నిర్వహించారు. ఇఒఆర్‌డి పద్మ, సర్పంచి సుజాత రామన్న ఆధ్వర్యంలో నిర్వహించిన వేలంపాటలో మాజీ సర్పంచ్ తిప్పేస్వామి 70 వేల రూపాయలకు వేలంపాట దక్కించుకున్నారు. రావుడి చెరువులో ఏడాది కాలం పాటు చేపల పిల్లలను వదిలి పెంచుకొని విక్రయించుకోవచ్చని అధికారులు తెలిపారు. చేపల పెంపకం ద్వారా వచ్చిన ఆదాయాన్ని ట్రెజరీలో జమ చేసి పంచాయతీ అభివృద్ధికి ఖర్చు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు రమ్య, రంగనాథ్, ఎంపీటీసీ బసవరాజు, ఎంపీపీ కామరాజు తదితరులు పాల్గొన్నారు.

కుంకుమ అలంకరణలో మహేశ్వరిదేవి

ప్రజాశక్తి-పెనుకొండ

శ్రీగిరి మహేశ్వరి శక్తిపీఠం లోవెలసిన మహేశ్వరి దేవి కుంకుమతో లలిత మహేశ్వరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చింది. శక్తిపీఠంలో గణపతి పూజ, సరస్వతి పూజ, కేత్యాయిని దేవి కలశారాధన, పుష్పాలంకరణ ,చండీ హోమం, అమ్మవారి ఉయ్యాల సేవ, మహా మంగళహారతి, తీర్థప్రసాద ,వినియోగం చేపట్టినట్లు శ్రీగిరి మహేశ్వరి శక్తి పీఠం వ్యవస్థాపకులు శ్రీ దేవేంద్ర స్వామి తెలిపారు.

ఎంపీని కలిసిన అధికారులు

ప్రజాశక్తి -పెనుకొండ టౌన్

పట్టణంలోని మడకశిర రోడ్డులోగల హిందూపురం పార్లమెంటు సభ్యులు కార్యాలయంలో ఎంపీ బికె. పార్థసారథిని పలువురు అధికారులు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పంచాయతీ రాజ్ (ప్రాజెక్టు) శాఖ పెనుకొండ డివిజనల్ ఇంజనీర్ తిరుమల రెడ్డి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ శ్రీసత్యసాయి జిల్లా రీజినల్ మేనేజర్ మధుసూదన్, పెనుకొండ, మడకశిర డిపో మేనేజర్ రామసుబ్బయ్య తదితరులు ఎంపీని కలిశారు. అనంతరం పెనుకొండ నియోజకవర్గం, రొద్దం మండలం, ఆర్ మరువపల్లి ఏపీఎంజేపీ ప్రిన్సిపల్ అనిత ఎంపీని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పాఠశాలలో డ్రైనేజీ సమస్య ఉందని, దాని వల్ల విద్యార్థులకు చాలా ఇబ్బందిగా ఉందని ఆమె ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎంపీ డ్రైనేజీ పనులకు పార్లమెంటు సభ్యుల నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా టేకులోడు ఏపీఎంజేపీ ప్రిన్సిపల్ శోభారాణి ఎంపీని మర్యాద పూర్వకంగా కలిశారు.వారి పాఠశాలలో ఉన్న వివిధ సమస్యలను పరిష్కరించాలని ఎంపీని ఆమె కోరారు.

ఎంపీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న రొద్దం మండలం మరువపల్లిఎపిఎంజెపి ప్రిన్సిపల్ అనిత

మెరుగైన వైద్యసేవలు అందించాలి : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి - మడకశిర

రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని డిఎం అండ్ హెచ్ఒ మంజువాణి డాక్టర్లకు సూచించారు. ఈ మేరకు ఆమె మంగళవారం మండలంలోని గుండుమల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి తగు జాగ్రత్త తీసుకోవాలని డాక్టర్లకు సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.